క్లుప్తంగా

ఉచితంగా మొబైల్ ఫోన్ల అందజేత



బధిర విద్యార్థులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ ఆరుగురు బధిరులకు ఒక్కొక్కరికీ రూ.15 వేల విలువైన మొబైల్ ఫోన్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఇన్‌చార్జి ఏడీ లక్ష్మణరావు, సూపరింటెండెంట్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి కన్నబాబు పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న కన్నబాబు

కరప: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో కలిసి సోమవారం కరపలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడిని పరామర్శించారు. పార్టీ నాయకుడు, కరప గ్రామానికి చెందిన వళ్ల లక్ష్మి కుమారుడు శివ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఇంటి వద్ద వైద్యం పొందుతున్నారు. మాజీ మంత్రి కన్నబాబు కరప వచ్చి బాధితుడు శివను పరామర్శించారు. వైద్యులు అందిస్తున్న చికిత్సను తెలుసుకుని, ధైర్యం చెప్పారు. ఆయన వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, వార్డు సభ్యుడు వాసంశెట్టి శ్రీను, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, నాయకులు సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు, కొత్తరవి తదితరులు ఉన్నారు.

క్యాంటీన్ పునః ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ

కాకినాడ రూరల్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో క్యాంటీన్‌ను సోమవారం పునఃప్రారంభించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతిశ్రీ ఈ క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు, అధ్యాపకులు, నాన్–టీచింగ్ సిబ్బంది అవసరాలను దృష్టిలో ఉంచుకుని, మంచి ఆహార సదుపాయాలను కల్పించేందుకు ఈ క్యాంటీన్ ఏర్పాటైందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, నాన్–టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలాజీచెరువు: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ చప్పిడి వేంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీనగర్ అశ్వినీ వైద్యశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆడంబరాల పేరుతో వృథా ఖర్చుకు బదులు, ఏమైనా సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మధుమేహం, రక్తపోటు పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. వచ్చే 20 ఏళ్లలో దేశంలో 40 కోట్ల మంది స్థూలకాయం బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పద్మావతి, భవానీ, దుర్గానాగమణి, అనంత్ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

బోట్‌క్లబ్: నగరంలోని పెద్ద మార్కెట్‌లో ఉన్న నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో జరిగే అన్నదానానికి కాకినాడకు చెందిన యాళ్ల అయ్యన్న, యాళ్ల లక్ష్మి, పసుపులేటి సీతామహాలక్ష్మి, లంకా చాందిని రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం ఆలయ ఈవో ఎం.మురళీవీరభద్రరావుకు ఈ మొత్తం అందజేశారు. దాతలను సత్కరించి, ప్రసాదాలు అందించారు. రూ.లక్ష వడ్డీతో ఏటా అమ్మవారి ఆలయంలో జరిగే పెద్ద జాగారం రోజున అన్నదానానికి వినియోగించాలని దాతలు కోరినట్లు ఈవో తెలిపారు.

నిర్వహణా లోపమా..! శాపమా?

- కుళాయిల నుంచి రంగు మారిన నీటి సరఫరా
- వేసవి వేళ అనారోగ్యానికి కేరాఫ్ అడ్రస్
- సమగ్ర మంచినీటి పథకాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం
- అవంతినగర్, మారుతీనగర్‌లో తాగు నీటి కష్టాలు



తిమ్మాపురం అవంతినగర్‌లో కుళాయిల ద్వారా సరఫరా చేసిన రంగు మారిన తాగునీరు



పండూరులోని సీపీడబ్ల్యూ స్కీం నీళ్ల ట్యాంకులు

కాకినాడ రూరల్: వేసవి వేళ.. గ్రామీణ ప్రాంత ప్రజల తాగు నీటి కష్టాలు ముంచుకొస్తున్నాయి. భానుడు ఇంకా పూర్తి ప్రతాపం చూపకుండానే కాకినాడ రూరల్‌లో తాగు నీటి కష్టాలు సర్వత్రా ఆందోళనకు గురిచేస్తున్నాయి. కుళాయిల ద్వారా నీరు రాక పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు కుళాయి లైన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడేయడంతో శివారు ప్రాంతాలకు నీటి సరఫరా లేక అక్కడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

ప్రజల ఆందోళన

ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉండనుంది. ఈ సమయంలో భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రజలు తాగు నీటి కష్టాలు చవి చూడాల్సి వస్తుంది. నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోవాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం.. గ్రామీణ ప్రాంత ప్రజలకు శాపంగా మారుతోంది. కొన్ని గ్రామాలలో కుళాయిల ద్వారా నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. మరికొన్ని గ్రామాలలో నాచుతో కూడిన ఆకుపచ్చ రంగు జలాలు కుళాయిల ద్వారా సరఫరా కావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తాగు నీరు సక్రమంగా లేకపోతే అతిసారా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

వేసవి ప్రారంభంలోనే..

రూరల్ మండలంలో 1.83 లక్షల మంది జనాభాకు తాగు నీటిని మెరుగ్గా సరఫరా చేయాల్సి ఉంది. తూరంగి గ్రామంలో ఏటా తాగు నీటి కష్టాలను ప్రజలు అనుభవించేవారు, ఈ సంవత్సరం వేసవి ప్రారంభంలోనే తిమ్మాపురం గ్రామ పరిధిలోని అవంతినగర్, మారుతీనగర్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కుళాయి నీరు వారం, పది రోజుల వరకు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పండూరు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ నుంచి పంపిణీ చేసే జలాలను సరైన విధంగా ఫిల్టర్ చేయకపోవడంతో నాచుతో కూడిన ఆకుపచ్చని రంగు నీరు కుళాయిల ద్వారా వస్తోంది. దీనిపై పంచాయతీ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదులు చేస్తున్నారు.

సమస్య తీవ్రంగా ఉంది

అవంతి నగర్‌లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. రంగు మారిన నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– మహమ్మద్ జిన్నా, అవంతినగర్ కాలనీ, తిమ్మాపురం

నీటి సరఫరా సక్రమంగా లేదు

పండూరు సీపీడబ్ల్యూ స్కీమ్ నుంచి తాగు నీటి సరఫరా సక్రమంగా లేదు. తిమ్మాపురం గ్రామంలో రంగుమారిన నీటిని సరఫరా చేశారు. వారం రోజుల పాటు నీటి సరఫరా లేకపోవడంతో అవంతినగర్, మారుతీనగర్ వాసులు ఇబ్బందులు పడ్డారు. నీటి సరఫరా మెరుగుపర్చడంతో పాటు, ఫిల్టర్ బెడ్‌లను మార్పు చేసి, నీటిని బాగా శుద్ధి చేసి పంపిణీ చేయాలి.

– బెజవాడ సత్యనారాయణ, సర్పంచ్, తిమ్మాపురం

సిద్ధంగా ఉన్నాం

వేసవి ఎద్దడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. వేసవిలో అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కోసం సర్పంచ్‌లను తీర్మానాలు కోరాం. ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల కోసం పైపులైన్లు దెబ్బతినడంతో నీటి సరఫరాలో ఆటంకం ఏర్పడింది. రంగు మారిన నీటిని కుళాయిల ద్వారా సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– మారుతీరావు, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కాకినాడ రూరల్

ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు శివమూర్తికి సత్కారం



డాక్టర్ శివమూర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు

బాలాజీచెరువు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి(ఐఐహెచ్‌పీ) జాతీయ ప్రెసిడెంట్‌గా నియమితులైన డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తిని సోమవారం ఓ హోటల్‌లో సత్కరించారు. ఐఐహెచ్‌పీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి డాక్టర్ సలాది సూర్యచంద్ర అధ్యక్షత వహించారు. ముందుగా హానిమన్ చిత్రపటానికి నివాళులర్పించారు. జాతీయ అధ్యక్షులుగా శివమూర్తితో పాటు, సౌత్ జోన్ కార్యదర్శిగా డాక్టర్ సుబ్బారావు నియమితులు కావడం ఆనందదాయకమని పలువురు వక్తలన్నారు. ప్రస్తుత కాలంలో హోమియోపతి వైద్యం మంచి ఫలితాలు ఇస్తుందని చెప్పారు. వైరస్ నిర్మూలనతో పాటు, మందులు వాడే విధానాన్ని వివరించారు. ప్రస్తుత తరానికి సీనియర్ హోమియో వైద్యులు మార్గదర్శకులుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యులు డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తతో పంచాయతీలకు ఆదాయం



నడకుదురులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ

కరప: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. ఇంటి వద్దే తడి, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. నడకుదురులో సోమవారం ఆయన పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్తను గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించి, అక్కడ వర్మీ కంపోస్ట్ తయారు చేసి, విక్రయించడం వల్ల పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. వర్మీ కంపోస్ట్ ఎరువును పూలమొక్కలు, ఆకుకూరలు, కాయగూరల పెంపకానికి వినియోగించవచ్చని వివరించారు. పంచాయతీ కార్యదర్శి కె.వరిజ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపర్చగా, 12 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 11 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆరు నెలల్లో గంజాయి జోరు



సమావేశంలో ఎమ్మెల్యే నానాజీ, ఎంపీపీ అనంతలక్ష్మి తదితరులు. వేదికపై వెనుక ఎంపీపీ భర్త త్రిమూర్తులు



గంజాయిపై వివరిస్తున్న సర్పంచ్ చక్రరావు. చిత్రంలో సర్పంచ్‌లు సత్యనారాయణ, సూర్యప్రకాశరావు, వీరన్న

- బార్లను తలపించేలా మద్యం దుకాణాలు
- గ్రామాల్లో ఏరులై పారుతున్న సారా
- మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన
- అభివృద్ధి చేయలేదని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం: ఎమ్మెల్యే

కాకినాడ రూరల్: గ్రామాల్లో సారా ఏరులై పారుతోంది. మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. షెడ్లు వేసి అక్కడే తాగేందుకు అనుమతిస్తున్నారు. ఆరు నెలల్లో గంజాయి విపరీతంగా పెరిగిపోయింది.. ఇవీ సర్పంచ్‌ల ఆవేదన. కాకినాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గంజాయిని తమ గ్రామంలో నిర్మూలించాలని కొవ్వూరు సర్పంచ్ పిల్లి చక్రరావు, తమ గ్రామంలో ఆరు బెల్ట్ షాపులున్నాయని.. సారా ఏరులై పారుతోందని నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, తమ గ్రామ పరిధిలోని గోకుల్ గార్డెన్‌లో మద్యం షాపు బార్‌లా షెడ్లు వేసి, అక్కడే తాగించి, విక్రయాలు జరుపుతున్నారని తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ గళమెత్తారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శాఖల వారీగా తొలుత సమీక్ష చేపట్టారు. సారా రహిత గ్రామాలపై ఎక్సైజ్ శాఖ నార్త్ స్టేషన్ ఎస్సై వరహాలు వివరిస్తుండగా, సర్పంచ్‌లు సారా, మద్యం, గంజాయి సమస్యలను లేవనెత్తారు. దీంతో ఎమ్మెల్యే నానాజీ స్పందించి, గ్రామాల్లో బెల్ట్ షాపులపై ఫిర్యాదులు అందుతున్నాయని, వారం రోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని కోరారు. తాను 9 నెలల పదవీ కాలంలో చాలా చేశానని, గత ఐదేళ్లలో తాను చేసిన దాంట్లో నాలుగో వంతు చేయలేదని, అభివృద్ధి చేయలేదని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. సమావేశం చివర్లో 9 నెలల పాలనలో చేపట్టిన పనులను వివరించారు. ఉపాధి నిధులతో కాకినాడ రూరల్‌లో రూ.19.90 కోట్లతో, కరప మండలంలో రూ.8.80 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, లింక్ రోడ్లు ఏర్పాటు చేశామని, రూ.12.9 కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ వర్క్స్ పనులు చేపడుతున్నామని వివరించారు.

పీఆర్ డీఈపై ఆగ్రహం.. ఆపై క్షమాపణ

మండల సమావేశంలో శాఖల వారీ సమీక్షలో భాగంగా పంచాయతీరాజ్ డీఈఈ సత్యశ్రీనివాస్ తమ శాఖ చేపట్టిన పనులు నివేదిస్తుండగా, ఎమ్మెల్యే నానాజీ జోక్యం చేసుకున్నారు. ఉపాధి నిధులతో రోడ్ల నిర్మాణం పది అడుగులు వేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున, తాము 12 అడుగులకు డీడీఆర్‌సీ సమావేశంలో కోరామని, ఆ విధంగా వేసేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. నిబంధనల మేరకు వేస్తున్నామని డీఈఈ స్పష్టం చేయడంతో, ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ముగింపు సమయంలో దీనిపై డీఈఈని క్షమాపణ కోరారు.

సక్రమంగా లేని రీ సర్వే

గ్రామాల్లో రీ సర్వేకు సంబంధించి తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ, తమ గ్రామంలో సర్వే సక్రమంగా జరగలేదని, మరోసారి చేయించాలని కోరారు. ఆవ భూములపై సర్పంచ్ ప్రస్తావించగా, క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం స్థలం చూస్తున్నామని, ఆవ భూముల్లో స్థలం ఉంటే సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. తూరంగి, తిమ్మాపురం గ్రామాల్లో సర్వే సక్రమంగా చేయించాలని తహసీల్దార్ కుమారికి సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా, తాగు నీటిని సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని జేఈ మారుతీరావును ఆదేశించారు. నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, తమ గ్రామంలోని నేమాం–4 లే అవుట్‌లో 9 గ్రామాల ప్రజలకు స్థలాలు ఇచ్చారని, సరిహద్దు రాళ్లు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేపూరు సర్పంచ్ నక్కా వీరన్న, పండూరు ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, సర్పవరం సర్పంచ్ శీలం నాగేశ్వరరావు తమ గ్రామాల్లో సమస్యలను ప్రస్తావించారు.

గంటకు పైగా ఆలస్యం

వాస్తవానికి ఈ సమావేశం ఉదయం 10.30కు ప్రారంభం కావాల్సి ఉండగా, ఎమ్మెల్యే రాక కోసం అధికారులు నిరీక్షించడంతో ప్రారంభం కాలేదు. దీంతో అరగంట పాటు వేచిచూసి ఎంపీటీసీ సభ్యురాలు గోపుశెట్టి పద్మజ రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోయారు. ఉదయం 11.45కు ఎమ్మెల్యే వచ్చాక ఎంపీడీఓ సతీష్ సమావేశం ప్రారంభించారు. అజెండాలోని అంశాలను చదవకుండా, కేవలం సమీక్షకే పరిమితమయ్యారు.

ప్రొటోకాల్‌కు తూట్లు

సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులకు మాత్రమే అనుమతి ఉంటుంది. ప్రొటోకాల్‌కు తూట్లు పడుతున్నా మండల పరిషత్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సమావేశపు వేదికపై ఎంపీపీ అనంతలక్ష్మి భర్త త్రిమూర్తులు, వైస్ ఎంపీపీ విరీష భర్తను కూర్చోబెట్టడం, సమావేశంలో నేమాం సర్పంచ్ మాట్లాడుతుండగా.. జనసేన కార్యకర్త కరెడ్ల గోవిందు సమాధానంగా మాట్లాడడంతో ప్రొటోకాల్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. పలువురు కార్యకర్తలు, నాయకులను సమావేశపు మందిరంలోకి అనుమతివ్వడంపై ఎంపీడీఓ సతీష్‌ను సర్పంచ్‌లు తప్పుపట్టారు.

ఆక్వా జోన్‌లో నమోదు చేయించుకోవాలి



అరట్లకట్ట గ్రామసభలో మాట్లాడుతున్న వీఎఫ్ఏ

కరప: ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందాలన్నా, విద్యుత్ వినియోగంలో రాయితీ రావాలన్నా ఆక్వా జోన్ పరిధిలో ఉండాలని వీఎఫ్ఏ వి.గాయత్రీ రమాదేవి అన్నారు. మండలంలోని అరట్లకట్ట, జెడ్.భావారం గ్రామాల్లో సోమవారం జరిగిన గ్రామసభల్లో ఆమె మాట్లాడారు. ఆక్వా జోన్‌లో లేని రైతులు తమ చెరువుల వివరాలతో నమోదు చేయించుకుని రెగ్యులర్ చేయించుకోవాలన్నారు. కరెంట్ సబ్సిడీ, ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాలంటే తప్పనిసరిగా ఆక్వా జోన్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. పంట నమోదు కూడా చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ గోపి సత్యవేణి, పంచాయతీ కార్యదర్శి వై.రాంజీ, ఏఈఓ ప్రశాంత్, వీఏఏ స్వర్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న శేషహోమం, పూర్ణాహుతి, అనంతరం చక్రతీర్థోత్సవం, 13న శ్రీపుష్పయాగోత్సవం, 20న పూర్ణాహుతి, సామ్రాజ్య పట్టాభిషేకం జరుగుతాయి.

విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలి



అదనపు కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న భద్రం

కాకినాడ సిటీ: నగరంలోని జగన్నాథపురం 24వ డివిజన్ బాపూజీ నగర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాలుకు విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలని దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షులు డోకుబుర్ర భద్రం, ఉపాధ్యక్షులు నందికి వీరబాబు కోరారు. ఈ మేరకు సోమవారం అదనపు కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే నగరపాలక సంస్థ సాధారణ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను స్థానిక ప్రజలు ఉపయోగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్, కమిషనర్లను కోరినట్లు భద్రం తెలిపారు.

11న పెద్దాపురంలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో పెద్దాపురంలోని ఎస్ఆర్‌వీబీఎస్‌జేబీ మహారాణి కాలేజీలో ఈ నెల 11న జరిగే మెగా జాబ్ మేళా జరగనుంది. ఈ పోస్టర్‌ను కలెక్టర్ షణ్మోహన్ సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సుమారు 35 ప్రముఖ కంపెనీల్లో 1,097 ఉద్యోగాలకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలో అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావు, వికాస పీడీ కె.లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

కొత్తపల్లి: ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి నుంచి 13వ తేదీ వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్టు ఎస్సై జి.వెంకటేష్ తెలిపారు. వాకలపూడి సమీపంలో ఉన్న బీచ్ రోడ్డులో భారత, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు టైగర్ ట్రయాంఫ్ కార్యక్రమం జరగనున్న కారణంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు చెప్పారు. ఉప్పాడ నుంచి బీచ్ రోడ్డు వైపు వెళ్లే వాహనాలు పిఠాపురం, కొమరగిరి మీదుగా ప్రయాణించాలని తెలిపారు. పర్యాటకులకు బీచ్ రోడ్డులో ప్రవేశం లేదన్నారు. వాహనచోదకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు : పాడా పీడీ

పిఠాపురం: పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో వచ్చిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని పాడా పీడీ చైత్రవర్షిణి అధికారులకు ఆదేశించారు. ఆమె సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి సోమవారం పాడా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ గ్రీవెన్స్‌లో మొత్తం 67 అర్జీలు వచ్చాయని, వాటిలో రెవెన్యూ 20, మున్సిపాలిటీ 29, ఇతర సమస్యలపై 18 అర్జీలున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాడా ఏపీడీ వసంతమాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బార్ ఎన్నికలకు తొలి రోజు 9 నామినేషన్లు



నామినేషన్లు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ 2025–26 నూతన కార్యవర్గానికి ఈ నెల 21న జరిగే ఎన్నికలకు తొలిరోజైన సోమవారం 9 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు జనరల్ సెక్రటరీగా సీహెచ్ వీరభద్రరావు(చంటి), రెడ్డి అన్నవరం, కేవీవీఎస్ఎన్ మూర్తి నామినేషన్లు దాఖలు చేశారు. కోశాధికారిగా ఏలేటి రమేష్, లైబ్రరీ సెక్రటరీగా మేడపాటి రామారెడ్డి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా గింజాల చక్రవర్తి, సీనియర్ కమిటీ సభ్యుడిగా నక్క సంజీవ్‌కుమార్, కమిటీ మెంబర్లుగా ఎం.ప్రసాదరావు, మర్ల ప్రవల్లిక నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారి ఎం.విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి చెక్కా శ్రీనివాస్ తెలిపారు.

ఆధునిక జీవన శైలితో సమస్యలు



ఆరోగ్య అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాకినాడ మెడికోవర్ ఆస్పత్రిలో వైద్యులు సోమవారం ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. జనరల్ ఫిజీషియన్ డా.వసంతకుమార్ మాట్లాడుతూ, ఆధునిక జీవన శైలిలో సౌకర్యాలతో పాటు, సమస్యలూ పెరుగుతున్నాయన్నారు. ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ క్షీణించడం, చాలీచాలని నిద్ర తదితర కారణాలతో అనారోగ్యం బారిన పడుతున్నట్టు చెప్పారు. తెల్లవారుజామున నిద్రలేవడం, రాత్రి త్వరగా పడుకోవడం, శారీరక శ్రమ చేయడం, సహజసిద్ధంగా పండే వాటిని భుజించడం, స్వచ్ఛమైన గాలి, నీటితో ప్రశాంతంగా జీవించడం ఆరోగ్యకర జీవితానికి ముఖ్యమైనవన్నారు. రూమటాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, బేకరీ ఐటమ్స్ ఆరోగ్యానికి హానికారకాలన్నారు. నిశ్చల జీవితం, వ్యాయామం లేకపోవడం, మానసిక అలసట, ఒత్తిడి, ఆందోళన రూపంలో ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నామని తెలిపారు. వైద్యులను సంప్రదించకుండా స్వయంగా మందులను వాడటం ప్రాణాంతకం కావచ్చన్నారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ శుభకరరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.